




# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 10-09-2024 సంపుటి : 06 సంచిక : 353 పేజీలు : 8 వెల : రూ 3-00

# చివరి దశకు వరదలపై యుద్ధం

**ఇది ముగిస్తే ఇక ఏపి పునర్నిర్మాణంపై దృష్టి**
**బుడమేరుపై జగన్ ప్రభుత్వం పాపాలు**
**2.75లక్షల మంది తీవ్ర బాధలు పడ్డారు**
**బోట్లు ద్వారా ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించే కుట్ర**
**జీవితాంతం ప్రజలకోసం పనిచేస్తా: చంద్రబాబు**

విజయవాడ,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ): వరదలపై యుద్ధం చివరి దశకు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ యుద్ధం రేపటితో ముగిస్తే ఇక ఏపీ పునర్నిర్మాణంపై దృష్టి పెడతామని అన్నారు. సింగ్‌నగర్‌లో వరద వచ్చిన తొలిరోజు తాను పర్యటించినప్పటికీ, ఇప్పటికీ చాలా పురోగతి ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మొదటి రోజు ప్రజలు చాలా బాధగా ఉండటం చూశానని అన్నారు. 9వ రోజు ప్రభుత్వంపై పూర్తి నమ్మకం చూస్తున్నానని తెలిపారు. బుడమేరుపై జగన్ ప్రభుత్వం చేసిన పాపాల వల్ల 2.75లక్షల మంది తీవ్ర బాధలు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కొన్ని సందర్భాల్లో చివరి వ్యక్తికి సహాయం చేయలేకపోయామని అన్నారు. బోట్లు ద్వారా ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించే కుట్ర పన్నారని విమర్శలు చేశారు. మొన్నటి వరకూ ఇసుక దొంగ వ్యాపారం చేసిన బోట్లను, ప్రజలను ముంచేందుకు పంపించారని ఆరోపించారు. గత ఏడాది ఇదే రోజు ఏ ఆధారం లేకుండా అక్రమ కేసులో నన్ను వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ రోజు ప్రజలంతా నా వెంట నిలిచారు. నా పట్ల అంత ఆదరణ చూపిన ప్రజల కోసం నా జీవితం అంకితం చేసి పని చేస్తా. నన్ను ఏ పేరుతో పిలిచినా పలుకుతూ, వారి మధ్యే ఉండి పని చేస్తా. ఈ రోజు ప్రజలకు కష్టం వస్తే నేనూ వారి మధ్య ఉన్నా. ఆ రోజూ బస్సులోనే ఉన్నా, ఈ రోజూ బస్సులోనే ఉన్నా. ప్రజల ముఖాల్లో నవ్వు చూద్దామనుకుంటుంటే, ఒక్కో ఇంట్లో ఒక్కో విషాద ఘటన ఉంది. అర్బన్ కంపెనీ సాయంతో పాడైన అన్ని వస్తువులు బాగు చేయిస్తున్నాం. ఈ యాప్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంచుతాం. ప్రజలు నిలదొక్కు కునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జటిలమైన సమస్యను సమన్వయంతో ప్రణాళికతో జాగ్రత్తగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఆప్కో ఇతరత్రా దగ్గర ఎన్ని బట్టలు ఉంటే అన్నీ తెప్పించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంటిలో ఉండే వారికి తలా ఒక జత బట్టలు ఇస్తామని అని మాటిచ్చారు. ఆప్కో లేదా ఇతర సంస్థల నుంచి వెంటనే దుస్తులు తెప్పించి ఇచ్చే ప్రయత్నం చేయాలని సంబంధిత అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. సోమవారం సాయంత్రం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటించారు. విజయవాడలోని ఉర్మిలా నగర్, కవేలా సెంటర్, సింగ్ నగర్, పైపుల రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి.. వరద బాధితులను పరామర్శించారు. ' ఒక్కో ఇంటికి ఒక్కో జత బట్టలు ఇస్తాము. చాలామంది బట్టలు పోయాయి అని చెబుతున్నారు. చెడిపోయిన వస్తువులను బాగు చేసేందుకు అర్బన్ కంపెనీకి బాధ్యతలు అప్పగిస్తాం. ఇన్సురెన్స్ క్లయిమ్ పెడితే వెంటనే ఇప్పిస్తాం. కాల్స్‌కు రెస్పాండ్ కావాలి. మీరు ఫీడ్ బ్యాక్ ఇస్తేనే మాకు నాణ్యమైన సేవలు అందించేందుకు వీలుంటుంది ' అని వరద బాధితులకు సీఎం సూచించారు. ఇదిలావుంటే ఇటీవల ప్రకాశం బ్యారేజీకి బోట్లు ఢీకొన్న ఘటనపై అధికారులు సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించారు. ఈ ఘటనలో కుట్రకోణం ఉందని తెలిపారు. డ్యాంను ఢీకొన్న బోట్లు వైసీపీ నేతలు, కార్యకర్తలవేనని నిర్ధారించారు. వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుల బోట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు నందిగం సురేష్, ఉషాద్రికి చెందిన బోట్లనే వినియోగించుకునే వారని చెప్పారు. బోట్ల రిజిస్ట్రేషన్ల నెంబర్ల ద్వారా వాటి యజమాను లను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్లను ఉషాద్రి, కర్రి నరసింహా స్వామి, గూడూరు నాగమల్లీశ్వరిలకు చెందిన విగా గుర్తించారు. ఉషాద్రికి చెందిన 3 బోట్లను కలిపి కట్టడం వెనుకు కుట్ర కోణం దాగి ఉన్నట్లు చెప్పారు. సాధారణంగా మూడింటిని కలిపి కట్టరని.. వాటికి ఇనుప చైన్ల లంగరు వేయకుండా ప్లాస్టిక్ తాళ్లతో కట్టేసినట్లు పేర్కొన్నారు. తమ బోట్లతో పాటు సమీపంలోని మరో రెండింటిని కూడా కొట్టుకెళ్లేలా కుట్ర చేశారని నివేదికలో తెలిపారు. ఈ నెల 2న తెల్లవారుజామున 3 గంటల సమయంలో 5 బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీకొట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. అవి గేట్లకు ఉండే కౌంటర్ వెయిట్లకు కాకుండా బ్యారేజీ పిల్లర్లను బలంగా తాకితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని చెప్పారు. మరోవైపు, పోలీసులు నిందితుల కాల్ డేటాను విశ్లేషిస్తున్నా రు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. రామ్మోహన్, ఉషాద్రిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 2న ప్రకాశం బ్యారేజీకి 11.42 లక్షల క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. అదే రోజున వేకువజామున 3 గంటల సమయంలో ఎగువ నుంచి పడవలు కొట్టుకొచ్చి.. 67,68, 69 గేట్లను ఢీకొట్టాయి. వీటిలో ఒకటి ప్రవాహ ఉధ్ధృతికి కొట్టుకుపోయింది. మరొకటి జాడ కనిపించలేదు. మిగిలిన వాటి వల్ల 2 గేట్లు దెబ్బతిన్నాయి. అయితే, దీనిపై కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తం కావడంతో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేసారి 4 బోట్లు రావడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని చెప్పారు. అటు, ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. పడవల్ని కొద్దిరోజుల కిందటే ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని గొల్లపూడి వైపు తెచ్చి నిలిపారని.. అంతకు ముందు వరకూ అవి గుంటూరు జిల్లా వైపు ఉన్న ఉద్దండరాయునిపాలెం వైపు ఉండేవని తేలింది. అయితే, కొద్ది రోజుల కిందటే వీటిని ఎందుకు తెచ్చారు.. గొల్లపూడి రేవు దగ్గర ఉన్న శ్మశానం దగ్గర ఎందుకు కట్టి ఉంచారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా పడవల్ని వేటికవే నది ఒడ్డున లంగరు వేసి కట్టి ఉంచుతారు.

## బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం..

### కోస్తాంధ్రలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడినవాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఒడిశాలోని పూరీకి 70 కిలోమీటర్లు, గోపాలపూర్‌కు 140కి.మీ., కళింగపట్నం(శ్రీకాకుళం)కు 240కి.మీ., దిఘా ( పశ్చిమ బెంగాల్)కు 290కి.మీ.దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర, వాయవ్య దిశగా గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది.మధ్యాహ్నానికి ఉత్తర ఒడిశాలోని పూరీ-పశ్చిమ బెంగాల్ ప్రాంతంలోని డేగ అల మధ్య తీవ్ర



వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది .తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర కోస్తాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిం చింది. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 12 వరకూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.భారీ వర్షాల కారణంగా అల్లూరి జిల్లా జీకే వీధి మండలం చట్రాయిపల్లి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురు గల్లంతైనట్లు తెలుస్తోంది. శిథిలాల కింద చిక్కుకున్న నలుగుర్ని అధికారులు రక్షించారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశంలో నివస్తున్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు జారీ చేశారు.

## భారత్‌లో తొలి మంకీ పాక్స్ కేసు

**ఢిల్లీలో ఒకరికి వ్యాధి లక్షణాలు**
**కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటన**



న్యూఢిల్లీ,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ): కొన్నేళ్ల క్రితం కరోనా మహమ్మారితో వణికిన ప్రపంచాన్ని మంకీపాక్స్ అనే వైరస్ చుట్టుముడుతోంది. ఇప్పటికే ఆఫ్రికా, యూరోపియన్ దేశాల్లో వ్యాపించిన ఈ వైరస్‌కు సంబంధించి సోమవారం తొలి కేసు నమోదైనట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ చేసింది. భారత్‌లో తొలి మంకీ పాక్స్ కేసు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఢిల్లీలో ఒకరికి వ్యాధి లక్షణాలను గుర్తించినట్లు పేర్కొంది. అతడిని పాజిటివ్‌గా నిర్ధారించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. పరీక్ష ఫలితాల్లో రోగిలో వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 ఓ÷ఔనీలీ వైరస్ ఉన్నట్లు గుర్తించామని చెప్పింది. అయితే ఈ ఏడాది మంకీ పాక్స్ సంబంధించి భారత్‌లో ఒక్క కేసు మాత్రమే నమోదైందని.. తొలిసారి దేశంలో 2022లో 30కిపైగా కేసులు వెలుగు చూశాయని అధికారులు తెలిపారు. ఈ కేసు.. 2022లో నమోదైన 30 కేసుల మాదిరిగానే అంత ప్రమాదకారి కాదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. పూనీలీ క్లాడ్ 1 ఆరోగ్య అత్యవసర స్థితికి సంబంధించిన వైరస్ కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరించింది. అయితే ఇది సోకిన వ్యక్తి ఓ÷ఔనీలీ తీవ్రతను ఎదుర్కొంటున్న దేశం నుంచి ఇటీవల ప్రయాణించిన ఓ యువకుడని తెలిసింది. ప్రస్తుతం అతడిని ఐసోలేషన్‌లో ఉంచినట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని.. ఆరోగ్య సమస్యలేవీ లేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది. ప్రపంచవ్యాప్తంగా కోరలు చాస్తున్న ఎంపాక్స్ వ్యాధిపై కేంద్రం సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. అనుమానిత వ్యక్తులందరికీ స్క్రీనింగ్, టెస్టింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్ చేయాలని సూచించింది. ఐసోలేషన్ కేంద్రాలను సిద్ధం చేయడానికి ఆసుపత్రులను గుర్తించాలని రాష్ట్రాలను కోరింది. అలాగే.. ప్రతిరోజూ ప్రజారోగ్య సంసిద్ధతపై సీనియర్ అధికారులతో సమీక్షించాలని కేంద్రం ఆదేశించింది

## వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో

**జయలక్ష్మి తీరుపై ప్రభుత్వం సీరియస్**

**విధుల నుంచి తప్పించిన కృష్ణా జిల్లా కలెక్టర్**

విజయవాడ,సెప్టెంబర్9 : వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో జయలక్ష్మి తీరుపై ప్రభుత్వం సీరియస్ అయింది. వీఆర్వోను విధుల నుంచి తప్పిస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ సృజన వెల్లడించారు. ఆమెకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. బాధితులతో సంయమనంగా వ్యవహరించాలని ఇప్పటికే చంద్రబాబు అధికారులకు సూచించారు. బాధల్లో ఉన్న బాధితులు ఓ మాట అన్నా.. ఓపిగ్గా సమాధానం చెప్పాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. అయినా పలువురు ఉద్యోగుల తీరు మారట్లేదు. దీంతో అలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠిన వ్యవహరిస్తోంది. మంచినీరు, ఆహారం తమ వీధిలోకి అందలేదని విజయవాడలో వరద బాధితులు ప్రశ్నించినందుకు వీఆర్వో జయలక్ష్మి ఒకరి చెంప పగలగొట్టారు. అక్కడితో ఆగకుండా పోలీసులు ముందే బాధితుడిని దుర్భాషలాడారు. నన్నే ప్రశ్నిస్తావా?అంటూ బాధితులపైనే అధికారులకు ఫిర్యాదు చేశారు. భోజనాలు, మంచినీరు అందటం లేదని ప్రశ్నించినందుకు ఇలా ఓ వీఆర్వో, వరద బాధితులపై చేయి చేసుకోవడం వివాదానికి దారి తీసింది. ఆమె వైఖరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు ఆమెపై చర్యలు తీసుకున్నారు.

## పౌర విమానరంగం అభివృద్ధి లక్ష్యంగా అడుగుల

**11, 12 తేదీల్లో భారత మండపం సదస్సుకు భారత్ ఆతిథ్యం**

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్9 ):మెరుగైన వస్తు రవాణాతో పాటు, పరస్పర సహకారంతో పాటు, అనుభవాలను పంచుకోవడంపై దృష్టి సారించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. భారత పౌర విమానయానాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. గ్రీన్ ఫీల్డ్, ఎయిర్ పోర్ట్‌లు, ప్రయాణ సౌకర్యాలు, ఫ్యూయల్, పౌర విమానయాన వ్యవస్థల అభివృద్ధిపై చర్చలు జరుగుతాయని చెప్పారు. పౌర విమానయానంపై ఢిల్లీలో రెండు రోజుల పాటు రెండో ఆసియా పసిఫిక్ సివిల్ ఏవియేషన్ మంత్రుల సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. కాగా, ముగింపు కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతారని తెలిపారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఈ నెల 11, 12 తేదీల్లో 'భారత మండపం' లో జరిగే సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొంటున్న 41 దేశాలకు చెందిన పౌరవిమానయాన శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. దేశంలో పౌర విమానయాన రంగం అభివృద్ధి, 41 దేశాల



మధ్య విమాన సౌకర్యాలను మెరుగు పరచడంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి పాకిస్తాన్ హాజరు కావడం లేదని స్పష్టం చేశారు. చైనా హాజరుపై సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## వరదబాధితులకు చిన్నారుల అండ

**31 వేలు సేకరించి అందచేత**
**విద్యార్థుల చేయూతకు చలించిన చంద్రబాబు**

అమరావతి,సెప్టెంబర్9 : ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విజయవాడ అతలాకుతలం అయిన సంగతి తెలిసిందే. ఎటు చూసినా హృదయ విదారక దృశ్యాలే. వరద బాధితులను ఆదుకోవడానికి సినీ, రాజకీయ.. పలు రంగాలకు చెందిన ప్రముఖులు ముందుకొచ్చి.. తమ వంతుగా విరాళాలు ప్రకటించారు. ఇందులో కొందరు నేరుగా సీఎం సహాయ నిధికి ట్రాన్స్‌ఫర్ చేయగా.. మరికొందరు నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కులు అందజేశారు. ఇలా సామాన్యుల నుంచి సెలబ్రిటీ వరకూ విరాళాలు ప్రకటిస్తూ పెద్ద మనసు చాటుకున్నారు. అయితే.. తాజాగా ఓ మారుమూల గ్రామంలోని స్కూల్ చిన్నారులు.. వరద బాధితుల కోసం మేము సైతం అంటూ ముందుకొచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే చిట్టి చేతులతో పెద్ద సాయమే చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ట్విట్టర్ వేదికగా షేర్ చేసిన సీఎం చంద్రబాబు ఎమోషనల్ అయ్యారు. ఓ మారుమూల గ్రామంలో స్కూల్ చిన్నారుల పెద్ద మనసు చూసి సీఎం చలించిపోయారు. ఈ వీడియో నిజంగా తన విషయంలో ఈ రోజును గొప్పగా మార్చింది అంటూ ఎక్స్ వేదికగా చంద్రబాబు ట్వీట్ చేశారు. పూర్తి వివరాల్లోకెళితే.. ' పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం, పడమర విప్పర్రు గ్రామంలోని శ్రీ విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన ఈ చిన్నారులు పెద్ద వాళ్లకు అందించడం నిజంగా చాలా గ్రేట్. విద్యార్థుల్లో ఇలాంటి ఉదాత్తమైన విలువలను పెంపొందించడం పట్ల స్కూలు యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను.అవసరం ఉన్న వారి పట్ల శ్రద్ధ వహించడం సాయం చేయడాన్ని వారికి బోధించడం చాలా గొప్ప విషయం.

# సంపాదకీయం

మంగళవారం 10-09-2024

## ఓటుతో మంచిని ఎంచుకోవచ్చు!

దేశంలో రాజకీయాల తీరు మారడం లేదు. ఉచిత పథకాలు, ఓట్ల కోసం డబ్బుల పందేరం వంటి చర్యలతో అధికారమే లక్ష్యంగా చేస్తున్న కుటిల యత్నాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించవు. ప్రజలు కూడా ఉచిత పథకాలతో సంతృప్తి చెందడం వల్ల నష్టపోయేది వారే. ప్రి ఎన్నికలోనూ పరిణతి చూపాల్సిన బాధ్యత ఓటర్లదే. ఓటు నమోదు చేసుకోవడం, దానిని సద్వినియోగం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. రానున్న కొన్ని రోజుల్లో హర్యానా, జార్ఖండ్, ఢిల్లీ, కాశ్మీర్‌లలో ఎన్నికలు జరుగబోతున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రజలు నాయకుల ఉపన్యాసాలకు ఉప్పొంగి పోకుండా ఆలోచన చేయాలి. వివేచనతో ఓటేయాలి. ఓటు మన భివష్యత్‌కు సూచికగా గుర్తించాలి. ఇటీవల ఉచిత పథకాలకు ఆర్థికంగా అమలు చేయడానికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని ఎన్నికల సంఘం పార్టీలను కోరుతూ లేఖ రాయడం.. ఉచితాలతో ప్రజలే నష్టపోతారని ఆర్‌బిఐలోని ఓ ఉన్నతాధికారి చెప్పడం చూస్తుంటే ప్రజలు చైతన్యం కావాల్సి ఉంది. ప్రజలు సచ్ఛీల రాజకీయాలను కోరుకుంటున్నా.. వారిని ఉచితాలతో మభ్యపెట్టి దేశాన్ని వెనక్కి నెడుతున్నారు. గెలుపు కోసం ఎంతకైనా తెగించడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయని ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోమారు చూశాం. ఎన్నికలో ప్రజలు కూడా పెద్దగా ఎవరు గెలుస్తారు..ఎవరిని గెలిపించాలన్న ధోరణిలో లేరు. ఎవరు ఎంత డబ్బులు ఇస్తారా అన్నది మాత్రమే చూస్తున్నారు. ఓట్ల కోసం ఇక్కడ చేస్తున్న కసరత్తు అంతాఇంతా కాదు. ఓ రకంగా ఖరీదైనవిగా ఎన్నికలు మారుతున్నాయి. ఓటేసినంత మాత్రాన తాయిలాలు ఎందుకు ఇస్తున్నారో ప్రజలు తెలుసుకోవాలి. నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారా లేదా తెలుసుకోవాలి. అలా కాఉండా గుడ్డిగా డబ్బులకు, మద్యానికి, హామీలకు లొగింతే మునిగేది ప్రజలే అన్నది కూడా గుర్తించాలి. ఉచిత పథకాలను సంక్షేమంగా చెప్పుకుంటున్న నాయకులు ప్రజల అభివృద్ధిని కాంక్షించడం లేదు. ఉచితాలు, సంక్షేమాలు, అభివృద్ధి తదితర పథకాలపై విస్తృతమైన చర్చ సాగాలి. ఎక్కడో ఒక దగ్గర విభజన రేఖ గీయాలి. ఢిల్లీలో కొత్తగా ప్రయోగాలు చేయడానికి ఏమీ లేకున్నా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. దాని ప్రభావం పంజాబ్‌పై పడింది. సాగుచట్టాలపై మొండి వైఖరి కారణంగా పంజాబ్‌లో బిజెపి భారీ మూల్యం చెల్లించుకుందనే చెప్పాలి. అయితే పన్నుల రూపంలో వసూలు చేస్తున్న ఆదాయాన్ని పాలకులు సంక్షేమం పేరిట అప్పనంగా నగదు బదిలీలు, ఉచిత పంపిణీ పథకాలతో ప్రజలను ఓట్ల యంత్రాలుగా మారుస్తున్నారు. ఇలాంటివన్నీ అభివృద్ధికి నిరోధకంగా తయారవుతుందని గుర్తించాలి. బతకాడానికి అవకాశాలు రావాలని ఆశిస్తున్నారు. ప్రజలకు కావాల్సింది సమస్యలను పరిష్కరించడం.. శాంతిభద్రతలను పరిరక్షించడం..అవినీతికి దూరంగా ఉండడం ముఖ్యం. ప్రజలు విజ్ఞులు అయినా.. రాజకీయ నేతలను మించి ఆలోచన చేయగలిగినా..ఎన్నికలు వచ్చే సరికి తాయిలాలు లొంగిపోతున్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా అన్నాహజారే స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగానే రాజకీయాల్లోకి వచ్చారు. ఇకపోతే యూపిలో యోగి ఆదిత్యనాథ్ రాకుముందు ఉన్న యూపికి..నేటి యూపికి భారీ తేడాను గమనించవచ్చు. ఎస్పీ కాలంలో అక్కడ గూండారాజ్యం కొనసాగింది. ములాయం సిఎంగా ఉన్నప్పుడు, అఖిలేశ్ యాదవ్ సిఎం అయిన తరవాత కూడా ఇదే కొనసాగింది. గుండాలు తమ ఇష్టం వచ్చినట్లుగా రాజ్యాన్ని ఏలారు. యువకుడు, బాగా చదువుకున్న అఖిలేశ్ యూపిని చక్కదిద్దుతారని ప్రజలు ఊహించారు. కానీ ములాయం పాలనలో ఉన్న గూండారాజ్యమే కొనసాగింది. ఈ క్రమంలో ప్రధానంగా యూపిలో పాలనపై దృష్టి పెట్టిన యోగి గూండాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. అక్రమార్కులకు సింహస్వప్నంగా నిలిచారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇసతున్నారు. గ్రామాల్లో ప్రజలు నిర్భయంగా తమ పనులు చేసుకునే విధంగా పాలనను తీర్చి దిద్దారు. రేపులు, దందాలు చేసే వారిని అణచివేశారు. ఈ క్రమంలోనే ప్రజలు మరోమారు యోగికి పట్టం కట్టారని తెలుసుకోవాలి. పాలకులు మంచిపాలన ఎలా ఇవ్వాలన్నది మరచి ఇప్పుడు ఉచిత పథకాలు, డబ్బుల పందేరాలపై ఆధారపడి గెలుపు ఎలా అనే సూత్రాన్ని పాటించాలను కుంటున్నారు. నిజానికి ప్రజలకు కావాల్సింది ఇది కాదు. వారికి ప్రశాంత జీవనం, బతకడానికి అవకాశాలు కావాలి. ఇవేవీ రాజకీయ నేతల ప్రణాళికలు ఉండవు. ప్రజలను ప్రేమతో గెలవాల్సిన పాలకులు ఎదుటి వారిని శతృవులుగా చూస్తున్నారు. సవాళ్లు విసురు తున్నారు. అభివృద్ధి, పాలన తదితర అంశాలనే ప్రధానంగా దృష్టి సారించకుంటే దేశం అధోగతి కాగలదు. ఆమ్ ఆద్మీ నేత అరవింద్ కేజ్రీవాల్ కూడా మెరుగైన పాలననే ప్రధానంగా ప్రచారం చేసినా ..ఆయన కూడా ఇప్పుడు ప్రజలకు తాయిలాలు ఇచ్చే ఆలోచనలతో పార్టీని ముందుకు తీసుకుని వెళుతున్నారు. ప్రతి ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినా గెలిచిన వారి ప్రత్యేకతను మాత్రమే చర్చించాలి. విస్తరణ కాంక్షలో పార్టీలో ప్రజలకు తాయిలాలనే నమ్ముకుంటున్నారు. ఇందుకు కేజ్రీవాల్ భిన్నం కాదని నిరూపించు కున్నారు. పార్టీలు ఏవైనా ప్రజలు ఉచితాలకు దూరంగా ఉండాలి. ఓట్లను అమ్ముకోకుండా ఉండాలి. పార్టీల అధికారం కోసం తాము బలవుతున్నామని గుర్తించాలి. లేకుంటే దేశం అధోగతి పాలుకాక తప్పదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శృతిమించుతున్న తాయిలాలపై పోరాడాలి. డబ్బుల పందేరాన్ని వ్యతిరేకించాలి. పన్నులు కట్టిన డబ్బులతో పందేరాలను నిలదీయాలి. అప్పుడే అభివృద్ధి అన్నది సాగుతుంది. లేకుండా గతుకుల రోడ్లు తప్పవు. అభివృద్ధి కనిపించదు. ప్రజలు మారితేనే రాజకీయాలు మారుతాయి.

## వినాయక నిమజ్జనం సందర్భంగా రస్నా, వాటర్ ప్యాకెట్లు పంపిణీ..

### మతసామరస్యతను చాటిన క్రైస్తవులు,ముస్లింలు..




ఎమ్మిగనూరు సెప్టెంబర్ 9 విభారె న్యూస్..వినాయక చవితి పండగ పురస్కరించుకొని సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా కులమతాలకు అతీతంగా మతసామరస్యతను చాటుతూ క్రైస్తవులు, ముస్లింల ఆధ్వర్యంలో మల్లెల గ్రూప్స్ అధినేత డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో స్టేట్ బ్యాంకు సర్కిల్ దగ్గర ప్రజలకు రస్నా, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పోలీస్ శాఖ అధికారులతో పాటు టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వి.జి.ఏ.దయ సాగర్,టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న,మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాల్ కోట ఖదీర్ భాష, ఐడియల్ యూత్ మూమెంట్ పట్టణ అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్,నేషనల్ యాంటీ కరప్షన్ రాష్ట్ర మహిళా సెక్రటరీ వసుంధర దేవి,మల్లెల గ్రూప్స్ సభ్యులు న్యూ లైఫ్ సావేలు, అజిత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపురం గ్రామంలో ఘనంగా వినాయక నిమర్జనం



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 09 విభారె న్యూస్ :- రుద్రవరం మండలంలోని నర్సాపురం గ్రామంలో సోమవారం గణనాధుల నిమర్జనానికి సిద్ధం చేశారు. పండుగ రోజు నుండి స్వామి వారికి దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. అనంతరం సోమవారం నాడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి ధూపదీప హారతులు సమర్పించారు. అనంతరం స్వామివారిని పలు రకాల వాహనాలలో ఉంచి గ్రామాలలో చిన్న పెద్ద ఆడ మగ తేడా లేకుండా మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, నడుమన ఆనందోత్సాహాలతో రంగులు చదువుకుంటూ ఊరేగింపు గా స్వామివారిని నిమార్జనానికి తీసుకొని వెళ్ళారు. భక్తులు వారి వారి ఇళ్ల వద్దకు స్వామి చేరుకోగానే స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గణనాధులను చెరువులు, కాలువలలో భక్తి శ్రద్ధలతో నిమర్జనం చేశారు. నమర్జనం అంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


## భారీ వినాయకుడు... నవరాత్రులు.. ట్రాఫిక్



హైదరాబాద్, సెప్టెంబర్ 9,వినాయక చవితి వచ్చిందంటే రాజధాని నగరంలో ఏ గల్లీ చూసినా వినాయక మంటపం కనిపిస్తుంది. నవరాత్రులు భక్తులు ఫుల్ హుషారుగా ఈ వేడుక చేసుకుంటారు. ముఖ్యంగా హైదరాబాద్ గణేషుడు అంటే వెంటనే ఖైరతాబాద్ విఘ్నేషుడు గుర్తుకు వస్తాడు. ఈ నవరాత్రుల్లో కనీసం 30 నుంచి 40 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఇక్కడ భారీ బందోబస్తుతోపాటు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్లు కూడా చేస్తుంటారు. ఈ సారి కూడా ఖైరతాబాద్ గణేషుడి మంటపం చుట్టూ పలు మార్గాలను వాహనదారులకు మూసేశారు. అందుకు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచించారు. ఈ మార్పులు పది రోజులపాటు అంటే వినాయక మహానిమజ్జనం వరకు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి రైల్వే గేట్ దాటి ఖైరతాబాద్ గణేషుడి విగ్రహం వైపునకు వచ్చే దారిలో వాహనాలకు అనుమతి లేదు. సచివాలయం వెనుక వైపున మింట్ కాంపౌండ్ నుంచి ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహం వైపునకు అనుమతి లేదు. ఖైరతాబాద్ పోస్టాఫీస్ నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వద్దకు గల దారిని కూడా వాహనాలకు మూసేస్తారు. రాజ్ దూత్ లేన్ నుంచి ఖైరతాబాద్ విగ్రహం వద్దకు వచ్చే దారిలో కూడా వాహనాలకు అనుమతి లేదు. నెక్లెస్ రోటరీ నుంచి ఐమాక్స్, సైఫాబాద్ పోలీసు స్టేషన్ మీదుగా మింట్ కాంపౌండ్ వైపు వచ్చే దారిలో కూడా వాహనాలను అనుమతించరు.ఈ దారులకు ప్రత్యామ్నా మార్గాలను కూడా ట్రాఫిక్ అధికారులు సూచించారు. మింట్ కాంపౌండ్ వైపు నుంచి ఖైరతాబాద్‌కు వెళ్లే వారు.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ కింది నుంచి సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ గార్డెన్.. రోటరీ నెక్లెస్.. ఆ తర్వాత ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ ఎక్కేసి వెళ్లిపోవచ్చు. అలాగే.. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు నుంచి ఇక్బాల్ మినార్.. అక్కడి నుంచి సైఫాబాద్ ఓల్డ్ పీఎస్.. అక్కడి నుంచి నిరంకారి నుంచి నేరుగా ఖైరతాబాద్ జంక్షన్‌కు వెళ్లవచ్చు.ఖైరతాబాద్ మహా గణేషుడి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్క్ చేసుకోవడానికి కూడా కొన్ని పార్కింగ్ ప్లేస్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. నెక్లెస్ రోటరీ సమీపంలో ఐమాక్స్ పక్కనున్న అంబేద్కర్ స్క్వేర్‌లో తమ వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఐమాక్స్‌కు ఎదురుగా, ఎన్టీఆర్ గార్డెన్, సరస్వతి విద్యా మందిర్, రేస్ కోర్స్ రోడ్.. ఈ ఏరియాల్లో పార్కింగ్ చేసుకోవచ్చు.వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా చేస్తున్నారు. ఊరూవాడ వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నారు. వరుణుడి కాస్త శాంతించటంతో చాలాచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ వినాయకుడు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈసారి 70 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా 70 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహిస్తున్నారు. 7 అంకెకు ప్రాధాన్యమిస్తూ 7 తలలు, 7 సర్పాలు రెండు వైపులా 7 చొప్పున మొత్తం 14 చేతులతో విఘ్నేశ్వరుడిని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ 28 అడుగుల వెడల్పుతో విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించింది. సప్తముఖ మహాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలు అందుకుంటున్నాడు. భారీ వినాయకున్ని చూసేందుకు భక్తులు తరలివస్తున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు సెలవు రావటంతో ఎక్కువ మంది భక్తులు తరలివచ్చారు. ఇంకోవైపు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు.

## అంగన్వాడీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి

### రాష్ట్ర టిడిపి తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ



రావులపాలెం:అంగన్వాడీలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామక్రృష్ణ అన్నారు. సోమవారం మండలపరిధి గోపాలపురం సూపర్ వైజర్ ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కొత్తపేట సిడిపిఓ పి శారద పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను మరింతగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని,గతంలో అంగన్వాడీలకు తెలుగుదేశం ప్రభుత్వం పక్కా బిల్డింగ్ లు కట్టించి కార్యకర్తలకు జీతాలు అధికమొత్తంలో పెంచడం జరిగిందన్నారు. అంగన్వా డీలకు అవసరమైన చోట బిల్డింగ్ లు నిర్మించటానికి ఎన్డీఏ కూటమి సంసిద్ధం గా ఉందన్నారు.అలాగే సిడిపిఓ శారద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా పౌష్టిక విలువలతో కూడిన



ఆహారాన్ని అందిస్తుందన్నారు.గర్భిణీ, బాలింతలు అధిక పోషకాలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు,చిరు ధాన్యాలు తీసుకోవాలని కొన్నిసలహాలు సూచనలిచ్చారు.అనంతరం కార్యక్రమంలో భాగంగా సీమంత వేడుకలు,అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు మైగాపుల గురవయ్య నాయుడు,అధికారి నాగేశ్వరరావు,ఓదూరి శివ,సూపర్ వైజర్ నాగ సత్యవేణి,కార్యదర్శి అన్వర్, ఎఎన్ఎమ్ లు,అంగన్వాడీ కార్యకర్తలు ఇందిర,స్వర్ణలత, భూలక్ష్మి,రఘానీ రాణి,సత్యవేణి,సత్యభవాని,నాగేశ్వరి,కవిత,లక్ష్మి, విజయలక్ష్మి,ఆశాలు, అధికసంఖ్యలో తల్లుల పాల్గొన్నారు.

## తెలంగాణకు భారీ వర్షసూచన

### మెచ్చరించిన వాతావరణ శాఖ

హైదరాబాద్,సెప్టెంబర్9 : తెలంగాణలో రాగల మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతుందని, ఒడిశా పూరీకి తూర్పు ఆగ్నేయ దిశలో 50 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని వాతావరణ కేంద్రం పేర్కొంది. వాయువ్య దిశగా పయనించి.. రాబోయే మూడుగంటల్లో ఒడిశా తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశా మీదుగా వెళ్తూ అదే తీవ్రతను కొనసాగిస్తూ సోమవారం అర్ధరాత్రి వరకు వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని చెప్పింది. రాబోయే 24 గంటల్లో ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా పయనించే అవకాశం ఉందని అంచనా వేసింది.ఈ క్రమంలో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఇక ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొంది. రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వివరించింది.

# రాజమండ్రిలో చిరుత సంచారం



రాజమండ్రి, సెప్టెంబర్ 9, రాజమండ్రి దివాన్‌చెరువు సమీపంలో చిరుతపులి పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు లాలాచెరువు, దివాన్‌చెరువు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. తూర్పుగోదావరి జిల్లా ఇంఛార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి మీడియా సమావేశం నిర్వహించి దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో లభ్యమైన పాదముద్రలను బట్టి ఇక్కడ సంచరించింది చిరుతపులిగా నిర్ధారణచేసినట్లు డీఎఫ్‌వో భరని ధృవీకరించారు. రాజమండ్రి దివాన్‌చెరువు, లాలాచెరువు సమీపప్రాంతాల్లోని ముఖ్యంగా స్వరూప్ నగర్, పద్మావతి నగర్, రూప నగర్, శ్రీరామ్‌నగర్, తారకరామానగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈప్రదేశాల్లో చిరుత తప్పకుండా సంచరిస్తుందన్నారు. ఎవ్వరూ ఆరు బయట కూర్చొవద్దని, బయటకు రావాల్సి వస్తే వెంట టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా ఆరుబయట ఉండే బాత్‌రూమ్ తలుపులుకు గడియ పెట్టుకోవాలని, చిన్నపిల్లల్ని ట్యూషన్లుకు చీకటి పడిన తరువాత పంపవద్దని, పిల్లలు బయట ఆడుకోనివ్వ వద్దని హెచ్చరించారు ఇప్పటివరకు మనుషులపై ఎటువంటి దాడి జరగలేదని, త్వరలోనే చిరుతను పట్టుకుంటామన్నారు. అందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. అయితే చిరుత బిహేవియర్‌ను బట్టి ఎన్ని రోజుల్లో పట్టుకోగలము అనేది ఆధారపడి ఉంటుందని, అనుమానం ఉన్నచోట్ల ట్రాప్‌కెమెరాలను, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని డీఎఫ్‌వో తెలిపారు. చిరుతకు సంబందించిన సమాచారం ఏమున్నా వెంటనే తెలపాలని సూచించారు. రాత్రి అయితే చాలు రాజమండ్రి శివారు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో చిరుతపులి సంచారంతో భయం భయంగా గడుపుతున్నారు. పులి సంచారం చేస్తున్న ప్రాంతాలుగా భావిస్తున్న చోట దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఫెక్సీ బ్యానర్లును ఏర్పాటు చేశారు. రాజమండ్రి శివారు ప్రాంతాలకు ముఖ్యంగా చిరుత పులులు దారితప్పి వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి.. రాజమండ్రి శివారు ప్రాంతంలోని దివాన్‌చెరువు ను ఆనుకుని దూరంలో అడ్డతీగల రిజర్వుఫారెస్ట్ ఉండగా అక్కడి నుంచే తరచూ చిరుత పులులు దారితప్పి ఇటువైపుగా వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఏదైనా జంతువును వేటాడే క్రమంలో దారితప్పి ఇలా జనావాసాల్లోకి చొరబడతాయని అటవీశాఖ అధికారులు తెలిపారు.రాజమండ్రి దివాన్‌చెరువు సమీపంలో చిరుతపులి పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ అధికారులు లాలాచెరువు, దివాన్‌చెరువు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో లభ్యమైన పాద ముద్రలను బట్టి చిరుతపులిగా నిర్ధారించినట్లు డీఎఫ్‌వో ధృవీకరించారు. ముఖ్యంగా స్వరూప్‌నగర్, పద్మావతినగర్, రూప్‌నగర్, శ్రీరామ్‌నగర్, తారకరామానగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రిపూట ఎవ్వరూ ఆరుబయట కూర్చొవద్దని, బయటకు రావాల్సి వస్తే వెంట టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. చిన్న పిల్లల్ని ట్యూషన్లుకు చీకటి పడిన తరువాత పంపవద్దని, పిల్లల్ని బయట ఆడుకోనివ్వద్దని హెచ్చరించారు.

'ఈ నెంబరుకు కాల్ చేయండి'

ఇప్పటివరకు మనుషులపై ఎటువంటి దాడి జరగలేదని, త్వరలోనే చిరుతను పట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు డీఎఫ్‌వో వెల్లడించారు. అనుమానం ఉన్నచోట్ల ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిరుతకు సంబంధించిన సమాచారం ఏమన్నా తెలిస్తే 18004255909 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మరోవైపు, చిరుత సంచారంతో రాజమండ్రి శివారు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో భయం భయంగా గడుపుతున్నారు. పులి సంచారం చేస్తున్న ప్రాంతాలుగా భావిస్తున్న చోట దండోరా వేయించి ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఫెక్సీ బ్యానర్లును ఏర్పాటు చేశారు.

# రోజా రీ ఎంట్రీ...



తిరుపతి, సెప్టెంబర్ 9, మాజీ మంత్రి ఆర్కే రోజా ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కనిపించకుండా పోయారు. ఆమె ఎక్కువగా చెన్నైలోనో, లేక కుటుంబ సభ్యులతో కలసి విదేశాల్లోనూ పర్యటిస్తూ కాలం గడిపేవారు. పుణ?య క్షేత్రాలను దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దాదాపు వంద రోజుల నుంచి ఆమె విజయవాడ వైపు కూడా రాలేదు. పార్టీ అధినేత జగన్ ను వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆర్కే రోజాపై అనేక రకమైన ప్రచారం జరిగింది. ఆమె తమిళనాడు రాజకీయాల్లోకి వెళుతున్నారని, హీరో విజయ్ పెడుతున్న పార్టీలో చేరి తమిళనాడు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అందుకు తగిన విధంగానే ఆర్కే రోజా రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉండటంతో నిజమేనని నమ్మిన వాళ్లుచాలా మంది ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్కే రోజాకు మంచి ప్రయారిటీ ఇచ్చారు. మంత్రి పదవి ఇవ్వకముందు నామినేటెడ్ పదవి ఇచ్చారు. అదే సమయంలో మంత్రి వర్గ విస్తరణలో ఆమెకు చోటు కల్పించి చిత్తూరు జిల్లా నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఆర్కే రోజాకు ఉందని జగన్ పార్టీ నేతలకు చెప్పకనే చెప్పారు. చిత్తూరు జిల్లాలో చాలా మంది ఆర్కే రోజాకు వ్యతిరేకమయినా జగన్ వారెవ్వరినీ లెక్క చేయకుండా మంత్రిపదవి ఇవ్వడంతో ఆమె మరింత రెచ్చిపోయారు. తన సొంత నియోజకవర్గంలోని నగరిలోనూ వైసీపీ నేతలను దూరం చేసుకున్నారు చివరకు ఎన్నికల సమయంలో అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులను జగన్ మార్చారు. ఐ ప్యాక్ టీం ఇచ్చిన నివేదికలను అనుసరించి అభ్యర్థులను మార్చారు. కొందరిని మరొక నియోజకవర్గాలకు పంపించి వేశారు. రోజాను కూడా నగరి నుంచి మారుస్తారన్న ప్రచారం జరిగింది. అయితే జగన్ మాత్రం చివరకు ఆర్కే రోజాకు నగరి టిక్కెట్ ను ఖరారు చేశారు. దీంతో ఆమె ఖుషీ అయ్యారు. ఆఖరుకు రోజా కు వ్యతిరేకంగా ఉన్న పార్టీ నేతలతో జగన్ స్వయంగా మాట్లాడి రోజా గెలుపునకు సహకరించాలని కోరారు. కానీ రాష్ట్రంలో కూటమి గాలి బలమైన గాలులు వీయడంతో ఆర్కే రోజా కూడా దారుణంగా గాలి భానుప్రకాష్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఆర్కే రోజా ఇప్పటి వరకూ జరిగిన ప్రచారానికి తెర దింపారు. తిరిగి రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదని నిలదీశారు. ఇక విజయవాడ వరదల్లో ప్రభుత్వం అట్టర్ ఫెయిల్యూర్ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా షో చేయడం తప్ప బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ముందుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. మొత్తం మీద ఆర్కే రోజా రాజకీయంగా యాక్టివ్ కావడం పట్ల క్యాడర్ లో సంతోషం కనపడుతుంది.

# రాజీనామాలు సరే... చేరెదెప్పుడు

ఏలూరు, సెప్టెంబర్ 9, వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో కొందరు ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవితో పాటు వైసీపీ ప్రాధమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. అయితే పార్టీలో ఇంత వరకూ చేరలేదు. వైసీపీ నుంచి పోతుల సునీతతో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావులు రాజీనామా చేశారు. రాజీనామా చేసి పది రోజులు దాటుతున్నా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకోలేదు. అందుకు అనేక కారణాలున్నాయని చెబుతున్నారు.బీద మస్తాన్‌రావు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ పోతుల సునీత విషయంలో మాత్రం స్థానిక నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ క్యాడర్ పెద్దయెత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోతుల సునీత టీడీపీలో ఉండేవారు. పోతుల సునీత భర్త పోతుల సురేష్ పరిటాల రవి అనుచరుడు. ఆమెకు తెలుగుదేశం పార్టీలో గతంలో మంచి ప్రాధాన్యత ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చి ఆమెకు ప్రయారిటీ ఇచ్చారు. కానీ 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోతుల సునీత టీడీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి వైసీపీలో చేరారు. వైసీపీలో పోతుల సునీతకు మంచి ప్రాధాన్యత ఇచ్చారు. మహిళ అధ్యక్షురాలిగా నియిమించారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అయితే తిరిగి టీడీపీ అధికారంలోకి రాగానే తనకున్న పరిచయాలతో ఆమె టీడీపీ అధినాయకత్వంలో కొందరికి దగ్గరయ్యారు. దీనికి తోడు టీడీపీకి కూడా శాసనమండలిలో ఎక్కువ మంది సభ్యుల మద్దతు, బలం అవసరం. అందువల్ల రాజీనామా చేసి రావాలని కోరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా పదవులకు రాజీనామా చేసి రావాలని, అయితే ట్రాక్ రికార్డు ను బట్టి పార్టీలో చేసుకుంటామని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో ఆయన మనసులో మాట అర్ధమయింది.వైఎస్ జగన్ పార్టీలో చేర్చుకోవద్దంటూ... పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ టీడీపీ సీనియర్ నేతలు కూడా చంద్రబాబుపై వత్తిడి తెస్తున్నారు. దీంతో ఆమె చేరిక విషయం పెండింగ్ లో పడినట్లయింది. అసలు పార్టీలో చేర్చుకుంటారా? చేర్చుకుని తిరిగి ఎమ్మెల్సీ పదవి ఇస్తారా? అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతుంది. ఇక రేపల్లెకు చెందిన మోపిదేవి వెంకటరమణ పరిస్థి?తి కూడా అంతే. రేపల్లెలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ వర్గం ఆయన చేరికను అడ్డుకుంటోందంటున్నారు. మోపిదేవికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ప్రచారం జరిగింది. అదే జరిగితే రేపల్లెల్లో నియోజకవర్గంలోని టీడీపీలో మళ్లీ గ్రూపులు మొదలవుతాయన్న ఆందోళన వ్యక్తమవుతుంది. మొత్తం మీద రాజీనామా చేసినా ఫలితం దక్కడం లేదని వైపీపీకి రాజీనామా చేసిన నేతలు ఆవేదన చెందుతున్నారు.

# ఒంటరి మహిళలు జాగ్రత్త....

## చంపడానికి వస్తున్న లేడీ సైనేడ్ కిల్లర్స్

గుంటూరు, సెప్టెంబర్ 9, గుంటూరు పోలీసులు అరెస్టు చేసిన లేడీ కిల్లర్స్ చేసిన హత్యల గురించి వింటుంటే ఒక్కసారిగా వెన్నులో వణుకు పుడుతుంది. తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీ కి చెందిన ముడియాల వేంకటేశ్వరి అలియాస్ బుజ్జి అనే 32 ఏళ్ల మహిళ తన తల్లి రమణమ్మ మరో కొంతమంది తో కలిసి ఒక గ్యాంగ్ లా ఏర్పడి నాలుగు హత్యలు చేశారు. ఇందులో బుజ్జి అత్తగారు సహా వారికి అప్పు ఇచ్చిన మరో వృద్ధురాలు, షేక్ నాగూర్ బీ అనే పక్కింటావిడను బంగారం డబ్బు కోసం కూల్ డ్రింక్ లో సైనైడ్ కలిపి వేరు వేరు సమయాల్లో చంపేసిన విషయం తెలిసిందే.తెనాలిలో మోషే అనే మరో వ్యక్తిని అతని భార్య సహకారంతో ఇన్స్యూరెన్స్ డబ్బులో వాటా ఇచ్చేలా మాట్లాడుకుని అతనికి మద్యం లో సైనైడ్ కలిపి తాగించి చంపేశారు. కేసు దర్యాప్తులో ఈ మహిళలు చేసిన వరుస హత్యలు తెలుసుకున్న పోలీసులే షాక్ కు గురయ్యారని గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. అయితే నిజానికి వారు మరో ముగ్గుర్ని కూడా చంపాలని ప్లాన్ చేశారు. కానీ ఆ ముగ్గురు చాలా లక్కీ గా చావునుంచి బయట పడ్డారని ఎస్పీ తెలిపారు. థ్రిల్లర్ సినిమా ట్విస్ట్ లను తలపించే ఆ ముగ్గురి డెత్ ఎస్కేప్ ఎలా జరిగిందో మీరూ తెలుసుకోండి.

1)అన్నంలో సైనైడ్ కలిపి వాలంటీర్ ను చంపే కుట్ర -

కెమికల్ రియాక్షన్ పుణ్యమా అంటూ చావు నుండి జస్ట్ మిస్

తెనాలి టౌన్ లో నివసించే అన్నపూర్ణ అనే ఆమె వాలంటీర్ గా పనిచేస్తుంది. గతంలో వాలంటీర్ గా పనిచేసిన ముడియాల వేంకటేశ్వరికి ఆమెతో కాస్త స్నేహం ఉంది. అన్నపూర్ణ ఇంట్లో దాదాపు 1,25,000 (లక్షా ఇరవై ఐదు వేలు) రూపాయల విలువైన బంగారం ఉందని తెలుసుకున్న వేంకటేశ్వరీ అలియాస్ బుజ్జి ఆమె తల్లి రమణమ్మ కలిసి అన్నపూర్ణ తినే ఆహారంలో సైనైడ్ కలిపారు. అన్నపూర్ణ చనిపోయాక ఆమె ఇంట్లో ఉన్న బంగారం తో పాటు అన్నపూర్ణ ఒంటిపై ఉన్న నగలు కూడా కాజేయ్యాలని బుజ్జి ఆమె తల్లి ప్లాన్ చేశారు. కానీ అదృష్టవశాత్తూ అన్నపూర్ణ తినే అన్నంలో కలిపిన సైనైడ్ కెమికల్ రియాక్షన్ కు గురై ఆ రంగు మారిపోయింది. ఆహారం పాడైంది అనుకుని దాన్ని తినకుండా బయట పారెయ్యడంతో తనకు తెలియకుండానే చావు నుంచి తప్పించుకుంది అన్నపూర్ణ. ఈ సంఘటన 2022 డిసెంబర్ లో జరిగింది.2) భర్త ఫోన్ కాల్ రావడం తో చావు నుండి తప్పించుకున్న వరలమదితెనాలిలో ఉండే మురగప్ప వరలమది అనే మహిళ తన కూతురు పెళ్లి కోసం బంగారు నగలు చేయించింది. వాటిని కొట్టేయడం కోసం మంచి మాటలతో ట్రాప్ చేశారు బుజ్జి ఆమె తల్లి రమణమ్మ. ఒకరోజు మాట్లాడేపని ఉందని వరలమది నీ ఊరి బయటకు తీసుకెళ్ళారు తల్లీ కూతుళ్ళు. థమ్స్ అప్ లో సైనైడ్ కలిపి తాగించి చంపేయాలని అనుకుంటుండగా వరలమది కి ఆమె భర్త ఫోన్ చేశాడు. ఆమె తన భర్తకు బుజ్జి,రమణమ్మ లతో కలిసి బయటకు వచ్చానని చెప్పడం విన్న బుజ్జి ఇప్పుడు వరలమది చనిపోతే తమమీద అనుమానం వస్తుందని సైనైడ్ కలిపిన థమ్స్ అప్ ఆమెకు ఇవ్వలేదు. ఇలా భర్త చేసిన ఫోన్ కాల్ భార్య వరలమదిని చావు నుంచి కాపాడింది.

3) టీలో కలిపిన మత్తు బిళ్ళలు పనిచెయ్యలేదు - బతికి పోయిన మిరాబీతెనాలిలో ఉండే షేక్ మిరాబీ అనే ఆమె దగ్గర ఉన్న 20000 రూపాయలు కాజేసేందుకు ఆమె ఇంటికి వెళ్ళిన బుజ్జి రమణమ్మ ఆమెను మాటల్లో పెట్టి టీలో మత్తు బిళ్ళలు కలిపారు. మీరాబీ మత్తు లోకి వెళ్ళగానే ఆమెకు ఊపిరాడ కుండా చేసి చంపాలని ప్లాన్ చేసారు . అయితే ఆ మత్తు టాబ్లెట్లు పని చేయకపోవడం తో వాళ్ల ప్లాన్ ఫెయిల్ అయింది.ఇలా బుజ్జి గ్యాంగ్ చేతిలో ఈ ముగ్గురు మహిళలు చావు నుంచి తృటిలో తప్పించుకోగా మిగిలిన నలుగురు మాత్రం తెనాలి లేడీ సైనైడ్ కిల్లర్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా పోలీసులు ఒంటరిగా ఉండే మహిళలు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ఎంత పరిచయం ఉన్న వారితోనైనా సరే జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

# సరుకుల పంపిణీ గందరగోళంగా ..

**కళ్యాణ మండపం తలుపులు పగల కొట్టుకొని లోనికి చోచ్చుకు వచ్చిన ప్రజలు**

**తొక్కిసలాట?. నలుగురికి తీవ్ర గాయాలు**

**అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

మైలవరంవరద బాధితులకు సరుకులు పంపిణీలో గందరగోళం చోటుచేసుకుంది ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వరద బాధితులకు సరుకులు పంపిణీ కార్యక్రమంలో తొక్కి ఇస్లాట తోడు చేసుకోవడంతో నలుగురికి గాయలను ఘటన కొండపల్లిలో చోటుచేసుకుందికొండపల్లి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు సరుకులు ఇవ్వడం ఆదివారం మధ్యాహ్నం మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. మంత్రులు అధికారులు వెళ్లిన అనంతరం సరుకులు పంపిణీల్లో గందరగోళం చోటు చేసుకుంది. దీంతో పంపిణీదారులు కళ్యాణ్ మండపం లోపల ఉండి ప్రజలను బయటపెట్టి తలుపులు వేశారు

# నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

## -ఆత్మహత్యలు వద్దు-నిండైన జీవితం ముద్దు

ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 10న జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారణకోసం ప్రజల్లో అవగాహన కలిగించడానికి 2003వ సంవత్సరం నుండి ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది.. ఆత్మహత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మహత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలుకొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించబడింది. ఆత్మహత్యకు ముందు ప్రవర్తనల గురించి అవగాహన పెంచడానికి, వాటిని ఎలా సమర్థవంతంగా నిరోధించాలో తెలియజేయడానికి ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ బహుళ-రంగ కార్యకలాపాల సంస్థ ఏర్పాటుచేయాలని, ఆ సంస్థ ద్వారా జాతీయ విధానాలు, ఆత్మహత్యల నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అంచనా వేయడానికి దేశాల సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. 2014లో విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్య నివేదిక ప్రకారం, తక్కువ ఆదాయం ఉన్న దేశానికి జాతీయ ఆత్మహత్యల నివారణ ప్రణాళిక లేదని, తక్కువ-మధ్యతరగతి ఆదాయపు దేశాలలో 10% కన్నా తక్కువగా, ఎగువ-మధ్య-అధిక ఆదాయ దేశాలలో దాదాపు మూడవ వంతుగా ఉన్నట్లు నివేదించింది. 2011లో ఒక అంచనా ప్రకారం ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 40 దేశాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల సందర్భంగా మానసిక వైద్య నిపుణులచే సదస్సులు నిర్వహిస్తారు.

# తిరుమలలో ఆధార్ ప్రామాణికంగా సేవలు

తిరుమల, సెప్టెంబర్ 9, తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా సేవలు అందించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాథమికంగా అనుమతి లభించిందని టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడనుందని వివరించారు. ఫలితంగా దర్శన, వసతి, శ్రీవారి సేవ తదితర సేవలను దుర్వినియోగం చేస్తున్న దళారులను అరికట్టవచ్చని చెప్పారు.అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ?.శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా లడ్డూ ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఆగస్టు 29వ తేదీ నుంచి దర్శనం టోకెన్ లేని వారికి ఆధార్ తో లడ్డూలను అందించే విధానాన్ని టీటీడీ ప్రవేశపెట్టిందని ప్రకటించారు.?గత కొన్నేళ్లుగా పలువురు దళారులు లడ్డూల బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించాం. తిరుమలలో దళారి వ్యవస్థను అరికట్టి, స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, దర్శనం టోకెన్లు లేనివారికి ఆధార్ కార్డుపై రోజువారి రెండు లడ్డూలను మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే చాలా కాలంగా భక్తులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, బయట ప్రాంతాలలో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వెల్లూరులలోని టీటీడీ సమాచార కేంద్రాలలో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికి మేము పంపలేకపోయాము. ప్రస్తుతం పంపిస్తున్నాం. గత నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు పంపబడ్డాయి" అని ఈవో శ్యామలరావు వివరించారు.తిరుమలలో దర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు ఒక ఉచిత లడ్డూతో పాటు, రూ.50/- ప్రాతిపదికన కోరినన్ని లడ్డూలు (స్టాక్ లభ్యత ఆధారంగా) అందజేస్తున్నామని స్పష్టం చేశారు. దీనికి ఆధార్ కార్డు అవసరం లేదన్నారు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదాల నాణ్యతను పెంచేందుకు, సువాసన, రంగు, రుచి ఉండే నెయ్యి కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ పెట్టడం జరిగిందని వెల్లడించారు.కాలినడకన వచ్చే భక్తులకు అలిపిరి పాదాలమండపం వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేయు కౌంటర్లు మరియు గాలిగోపురం వద్ద స్కానింగ్ కౌంటర్లను త్వరలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈవో పేర్కొన్నారు. " ?శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు, ముఖ్యంగా అక్టోబర్ 8వ తేదీ శ్రీవారి గరుడసేవను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. ? ?జూన్ నెల మొదటి వారంలో యాత్రికులకు వారానికి 1.05 లక్షల ఎస్ఎస్ డి టోకెన్లు ఇవ్వగా,



ఇప్పుడు వారానికి 1.63 లక్షల టోకెన్‌లు జారీ చేస్తున్నాం. ఎస్ఎసడి టోకెన్స్ పెంచిన కారణంగా ఈ టోకెన్ పొందిన భక్తుల నిరీక్షించే సమయం గణనీయంగా తగ్గింది" అని ఈవో ప్రకటించారు.త్వరలో బెంగళూరుకు, హైదరాబాద్ కు చెందిన నిపుణులు తిరుమల లోని వివిధ అన్నప్రసాద కేంద్రాలను సందర్శించనుందని ఈవో తెలిపారు.? అన్నప్రసాద విభాగాన్ని ఆధునికరించడంతో పాటు అన్నప్రసాదాల పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసే చర్యలు తీసుకుంటామన్నా రు.?వీ రందించే సూచనల మేరకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అన్నప్రసాద విభాగాన్ని శాశ్వతంగా సంపూర్ణ స్థాయిలో ఆధునికరిస్తామన్నారు. ?శ్రీవారి భక్తుల నుదుటన పవిత్రమైన "తిరునామం" ధారణ కార్యక్రమం, తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాలలో శుక్రవారం నుండి పునఃప్రారంభిస్తున్నట్లు వివరించారు.

## నేడు డిసిసి అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్న పరిగెల మురళీకృష్ణ..



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 విభారే న్యూస్.. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యా లయం కళా వెంకట్రావు భవనం నందు నేడు 10:30 ని"లకు జిల్లా కాంగ్రెస్ కమిటి నూతన అధ్యక్షులుగా మాజి ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించ ను న్నారు. ముందుగా సి క్యాంప్ సెంటర్ నందలి రాజీవ్ గాంధీ విగ్రహమునకు, కిసాన్ ఘాట్ నందలి కోట్ల విజయభాస్కర్ రెడ్డి సమా ధికి, రాజవిహార్ సెంటర్ నందలి శ్రీమతి ఇందిరా గాంధీ విగ్రహమునకు, ఐదు రోడ్ల సర్కిల్ నందలి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహము నకు, కోట్ల సర్కిల్ నందలి కోట్ల విజయభాస్కర రెడ్డి విగ్రహమునకు, పాత బస్టాండ్ నందలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహము నకు, పార్టీ కార్యాలయం ముందు గల దామోదరం సంజీవయ్య విగ్రహమునకు పూలమాలలు వేసిన అనంతరం పార్టీ కార్యాలయమునకు విచ్చేసి పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశం అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించెదరు. అనంతరం కర్నూలు సిటీ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా షేక్ జిలాని భాష పదవి బాధ్యతలు చేపట్టుదురు. కనుక ఈ కార్యక్రమమునకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్నూలు జిల్లా పరిధి నందలి నూతన పిసిసి కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నుండి పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు మాజీ డిసిసి కార్యవర్గ సభ్యులు, కర్నూలు నగర కాంగ్రెస్, పార్టీ అనుబంధ సంస్థలైన జిల్లా మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఐ ఎన్ టి యు సి, ఎన్ ఎస్ యు ఐ, సేవాదళ్, కిసాన్ సెల్, లీగల్ సేల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనారిటీ సెల్, డాక్టర్ సెల్, కల్చరల్ సెల్, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ మొదలగు నాయకులు ఈ కార్యక్రమమునకు హాజరు కావలసిందిగా కోరుచున్నాము. పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం పరిగెల మురళీకృష్ణకి జిల్లా కాంగ్రెస్ నాయకులు సన్మానం చేసెదరు.

## వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు విశేష పూజలు..



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 విభారె న్యూస్.. శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఉదయం ప్రాతఃకాల పూజలు మహాగణపతికి అభిషేకములు, విశేషముగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిహోమములునిర్వహించ దంజరిగినది. భక్తాదులు, విద్యా ర్థిని, విద్యార్థులు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి హోమము నందుపాల్గొనిస్వామి వారికృపకు పాత్రల య్యారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించండం జరిగినది.

## కరెంట్ వైర్ల చోరీ నిందితులు అరెస్టు...



నందవరం సెప్టెంబర్ 9 విభారే న్యూస్..మంత్రాలయం, మాధవరం, నందవరం, కోసిగి ప్రాంతాల్లో తుంగభద్ర నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న శ్రీ గురు రాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ పంపుసెట్లను పగలగొట్టి అందులోని రాగి వైర్లు, రాగి ప్లేట్లు, ఆయిల్ ను దొంగలించుకుని లక్షల రూపాయల నష్టాన్ని కలిగించిన నిందితులను అరెస్టు చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీనివాస ఆచారి సోమవారం తెలిపారు. నిందితుల నుంచి రూ. 9 లక్షల నగదు, 25 కేజీల కాపర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## నేటి సాయంత్రం 4 నుండి 5 వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం...

కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 విభారె న్యూస్.. కర్నూలు-2 డిపో పరిధిలోని గ్రామాలకు సంబంధించిన బస్సు రవాణా సమస్యల పరిష్కారం కొరకు, సలహాలు స్వీకరించుటకు, ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం, కర్నూలు-2 డిపో మేనేజరు, నేడు "డయల్ యువర్ డి.యం." కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 04.00 నుండి 05.00 గంటల మధ్య నిర్వహిస్తారు. కావున, ప్రయాణీకులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని, ఏవైనా సమస్యలు/సూచనలు ఉన్న యెడల " డయల్ యువర్ డి.యం." ప్రోగ్రాం లో తెలియజేయవలసిందిగా కోరడమైనది. డయల్ చేయవలసిన ఫోన్ నెంబరు : 9959225794తేదీ : 10.09.2024 సమయం:సాయంత్రం 04.00 నుండి 05.00 గంటల వరకు..

## సి ఐ సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జామియా కమిటీ సభ్యులు..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 09 విభారె న్యూస్..నూతన సీఐ సుదర్శన్ రెడ్డి ని జామియా మసీదు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు కె ఖాసీం బేగ్, మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, హాజీ హయాత్ అలీ, దౌల, రసూల్, మాభాష, హాజీ వాహిద్, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.



## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం... - జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్..



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 విభారె న్యూస్..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 91 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 91 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1)నేను ఎమ్మిగనూరు బ్రాంచ్ - యూనియన్ బ్యాంకులో బిజినెస్ కరెస్పాండ్ గా పని చేస్తున్నాను. మే 17 న నా ఫోన్ నెంబర్ కు సైబర్ నేరగాళ్ళు ఫోన్ చేసి మొబైల్ బ్యాంక్ యాప్ ద్వారా నా మొబైల్ ను హ్యాక్ చేసి రూ. 5 లక్షలు ఆన్ లైన్ ఫ్రాడ్ చేశారని యూనియన్ బ్యాంక్ లోని నా ఖాతా నుండి డబ్బులు కాజేశారని, నాకు న్యాయం చేయాలని ఎమ్మిగనూరు మండలం, కోటేకల్లు గ్రామానికి చెందిన ఇబ్రహీం ఫిర్యాదు చేశారు. 2)కర్నూలు ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లో నా కుమారుడికి, నా కుమార్తె కు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు, వెంకటరమణ కాలనీ కి చెందిన ఆయేషా బేగం, జహీర్ లు రూ. 5 లక్షల 75 వేలు తీసుకొని మోసం చేశారని కర్నూలు, వివేక నగర్ కు చెందిన ఉదయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. 3) ప్యాలకుర్తి కి చెందిన రాజు రూ. 25 వేలు ఇస్తే రూ. 8 లక్షలు స్పాట్ లోన్ (రుణం) ఇప్పిస్తానని చెప్పి నమ్మించి, ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకొని మోసం చేశాడని దేవనకొండ మండలం, పి. కోటకొండ గ్రామానికి చెందిన సంజన్న ఫిర్యాదు చేశారు. 4) వరి ధాన్యం కోనుగోలు చేసిన జి. శింగవరం గ్రామానికి చెందిన మల్లికార్జున శెట్టి నాలుగు సంవత్సరాల నుండి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు కు చెందిన రవి కుమార్ ఫిర్యాదు చేశారు. 5) ఆస్తి కోసం పెద్ద కుమారుడు కాశన్న, కోడలు సుగుణమ్మ ఇబ్బందులకు గురి చేస్తున్నారని న్యాయం చేయాలని ఎమ్మిగనూరు, ఎర్రకోట గ్రామానికి చెందిన సుంకమ్మ ఫిర్యాదు చేశారు. 6)మా పొలంలోకి మమ్మల్ని రానివ్వకుండా మహదేవమ్మ, వన్నూరప్ప ఈ పొలం మాదే అంటూ దౌర్జన్యం చేస్తున్నారని హోళగుంద, కోగిల తోట గ్రామానికి చెందిన మారెమ్మ ఫిర్యాదు చేశారు. 7) నాకు తెలిసిన ఆర్ ఎంపి డాక్టర్ పాత కక్షలతో గుర్తు తెలియని వ్యక్తులచే ఫోన్ కాల్స్ చేయించి బెదిరింపులకు పాల్పడుతూ బ్లాక్ మెయిలింగ్ చేయిస్తున్నారని దిన్నెదేవరపాడు గ్రామం కు చెందిన రవితేజ ఫిర్యాదు చేశారు. 8) 5 ఎకరాలలో 1ఎకర 16 సెంట్ల భూమి ని అక్రమంగా ఆన్ లైన్ చేసుకోవడమే కాకుండా మమ్మల్ని సుధాకర్ అనే వ్యక్తి కొట్టి గాయపరిచాడని వెల్దుర్ది మండలం, బింగిదొడ్డి గ్రామానికి చెందిన వెంకటరాముడు ఫిర్యాదు చేశారు. 9) కుమారుడు, కోడలు వేధిస్తున్నారని, నన్ను ఇంటి నుండి బయటకు పంపించారని, నా ఇల్లు నాకు ఇప్పించే విధంగా చేయాలని, కుమార్తె దగ్గర ఉంటున్నాని కర్నూలు, మజూందార్ నగర్ కు చెందిన సుశీల ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ గుణశేఖర్ బాబు పాల్గొన్నారు.

## మతసమారస్యానికి ప్రతీక వినాయక చవితి..



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 9 విభారె న్యూస్..వినాయక మూర్తులను సందర్శించిన సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి. రంగయ్య. ప్రత్యేకంగా ఆహ్వానం తెలిపిన ఎన్.టి.ఆర్ కాలనీ యూత్. వినాయక విగ్రహదాత ఇబ్రహీం కు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపిన రంగయ్య ఎన్టీఆర్ కాలనీ యూత్ కి రుణపడి ఉంటా అందరికి అందుబాటులో అండగా ఉంటా..రంగయ్యయెమ్మిగనూరు పట్టణ వినాయక చవితి సందర్భంగా ఆయా విధులలో ఏర్పాటు వినాయకులను సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి. రంగయ్య సందర్శించి దీవెనలు అందుకున్నారు. కులమతాలకు అతీతంగా జరుపుకుంటున్న పండుగ అని స్వేచ్ఛ గా సోదరభావం తో పండుగ చేసుకోవాలి అని రంగయ్య తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీ లో యువత ఏర్పాటు చేసిన గణ నాథున్ని యువత ఆహ్వానం మేరకు సమతా సైనిక్ దళ్ యూత్ వింగ్ జిల్లా అధ్యక్షులు నల్లన్న నాయకులు బలరాం రాముడు తరుణ్ కేశవ మహేష్ ఆధ్వర్యంలో సందర్శించారు. ముందుగా టపాకాయలు డ్రమ్స్ తో మాల మహాత్మా సద్దాం యువత ఘనంగా స్వాగతం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సినీ ఆర్కెస్ట్రా గాయకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేదిక మీద శాలువా తో పూలమాలతో సన్మానం చేశారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ అసలైన పండుగ యెమ్మిగనూరు లో జరుగుతుంది అని ఇదే పండుగ వాతావరణం దేశ వ్యాప్తంగా రావాలని ఎన్.టి.ఆర్. కాలనీ లో మైనారిటీ కి చెందిన ఇబ్రహీం విగ్రహ దాత గా ఉంటాడం చాలా సంతోషం అని కుల మతాలకు అతీతంగా జరుగుతున్న పండుగ కు నాకు ప్రేమ తో పిలిచి అభిమానం చూపిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటా అని తెలిపారు. ఎటువంటి అవంచానియా సంఘటన లు జరగకుండా పోలీస్ వారు కల్పిస్తున్న రక్షణ, పండుగ జరుపుకోడానికి అన్ని అనుమతులు ఇప్పించిన స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరెడ్డి కి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా యూత్ వింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న వైయస్సార్సీపి చాంద్ ను పరామర్శించిన పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 09 విభారె న్యూస్..అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్ఆర్సిపి నాయకుడు టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సయ్యద్ చాంద్ ను వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర గౌడు, కౌన్సిలర్లు వహీద్, షబ్బీర్, తార రాజశేఖర్, మహానందయ్య శెట్టి, తట్టే బుడ్డప్ప తదితరులు పాల్గొని పరామర్శించి వారు తొందరగా కోలుకోవాలని వారు ఆశాభావం వ్యక్త పరిచారు..



## వరద బాధితుల కోసం....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 9 విజయవాడ వరద బాధితుల కోసం తమవంతు సామాజిక బాధ్యతగా నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన స్ఫూర్తి సేవా సమితి సభ్యులు సంస్థ ఆధ్వర్యంలో డోన్ పట్టణ, డోన్ గ్రామీణ, సోషల్ మీడియా దాతల సహకారంతో బియ్యం, పదిరకాల నిత్యావసరాలతో కూడిన మూడు వందల కిట్లతో నేరుగా వరద బాధితులకు అందించేందుకు డోన్ నుంచి ప్రత్యేక వాహనంలో విజయవాడకి బయలుదేరి వెళ్లారు. ఈ వాహనాన్ని డోన్ ఎమ్మార్వో నాగమణి, డోన్ డీయస్పి శ్రీనివాసులు, డోన్ టౌన్ సీఐ ఇంతియాజ్ బాషా లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజయవాడ వరద బాధితుల కోసం డోన్ డీయస్పి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని స్ఫూర్తి సేవా సమితి వారికి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ వరద బాధితుల కోసం బియ్యం, వస్తు, ఆర్థిక రూపంలో సాయం అందించిన ప్రతి ఒక్కరికి స్ఫూర్తి సభ్యులు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**